క్లుప్తంగా

న్యాయవాదులకు శిక్షణ

కడప అర్బన్‌: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.బాబా ఫక్రుద్దీన్‌ తమ సిబ్బందితో కలిసి కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవా సదన్‌లో నాలుగవ రోజు గురువారం కూడా 'మధ్య వర్తిత్వం'పై న్యాయవాదులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ నుంచి వచ్చిన రీసోర్స్‌ పర్సన్‌లు పీజీ సురేష్‌, జి.జ్యోతి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదలకు ఫిత్రా పంపిణీ

కడప కల్చరల్‌ : కడప నగరంలోని మస్తాన్‌ వలి వీధిలో ఉన్న జమాతె ఇస్లామి హింద్‌ కార్యాలయంలో గురువారం పేదలకు ఫిత్రా పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంస్థ నాయకులు ఇందాదుల్లా హుసేని, ఖాదర్‌ వలీ, పీఎస్‌ రహమతుల్లా, జాకీర్‌ హుస్సేన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్‌ మాసం దానధర్మాల మాసమన్నారు. దాదాపు 200 మందికి ప్రతి ఒక్కరికి 500 రూపాయలను ఫిత్రా పంపిణీ చేశామన్నారు.

కంప్యూటర్‌ అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరంలోని సీఎస్‌ఐ చర్చికి కెనరాబ్యాంకు అధికారులు సీఎస్‌ఆర్‌ కార్యక్రమంలో భాగంగా ఆర్‌ఎం మురళీమోహన్‌ ఆధ్వర్యంలో కంప్యూటర్‌, ప్రింటర్‌ను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రమైన చర్చికి ఈ వస్తు సామాగ్రిని అందజేశామని బ్యాంకు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎం రమేష్‌, మెర్సీ, బ్యాంకు సిబ్బంది, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

టూరిజం రీజినల్‌ సెంటర్‌ను కడపకు కేటాయించాలి

కడప కల్చరల్‌ : ఇండియన్‌ టూరిజం ఆంధ్రప్రదేశ్‌ రీజినల్‌ సెంటర్‌ను భారత పర్యాటకశాఖ కడపలో ఏర్పాటు చేయాలని తాళపత్ర లిపి నిపుణులు మునికుమార్‌ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రీజినల్‌ సెంటర్‌తోపాటు ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజం అండ్‌ ట్రావెల్‌ మేనేజ్‌మెంట్‌, నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ వాటర్‌ స్పోర్ట్స్‌, నేషనల్‌ కౌన్సిల్‌ ఫర్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌, నేషనల్‌ కౌన్సిల్‌ ఫర్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ క్యాటరింగ్‌ టెక్నాలజీ సంస్థలను కూడా ఒకే కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ఒకే ప్రాంగణంలో వీటి కార్యాలయాలను అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ మేరకు తాను భారత పర్యాటక శాఖ మంత్రి ఎస్‌.గజేంద్రసింగ్‌కు వినతిపత్రాన్ని పంపామని తెలిపారు.

దాల్మియా బాధితులకు న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : దాల్మియా సిమెంట్‌ పరిశ్రమ ద్వారా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్‌ చేశారు. దాల్మియా సిమెంట్‌ పరిశ్రమ నిబంధనల ఉల్లంఘనలు – పరిశ్రమ విస్తరణ తక్షణం నిలిపివేయాలని గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి


మృతి చెందిన వైఎం వెంకటేష్‌ (ఫైల్‌)

కడప అర్బన్‌: కడప నగరం విజయదుర్గ దేవాలయం సమీపంలో రోడ్డుపై ఆయిల్‌ పడి పోయింది. స్కూటర్‌ పై వెళుతున్న వ్యక్తి ఆయిల్‌ ఉన్న సైడు రావడంతో కిందపడి తీవ్రగాయాలు అయ్యాయి. కడప ట్రాఫిక్‌ సీఐ జావెద్‌ వివరాల మేరకు.. కడప చెమ్మమియాపేటలోని విజయనగర్‌ కాలనీకి చెందిన బలపనూరు వైఎం వెంకటేష్‌ (65) గురువారం రాత్రి స్కూటర్‌ వెళుతున్నాడు. కాగా రోడ్డుపై ఆయిల్‌ పడిఉన్న ప్రాంతంలో వెళ్లడంతో జారి కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్‌ నేరాల నియంత్రణకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్‌: సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. గురువారం రాత్రి జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌ కుమార్‌ ఆదేశాలతో కడప నగరంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైబర్‌ క్రైమ్‌ ఇన్‌స్పెక్టర్‌ మధుమల్లేశ్వర రెడ్డి, వన్‌ టౌన్‌ సీఐ బి. రామకృష్ణ, ట్రాఫిక్‌ సీఐ జావేద్‌, సైబర్‌ క్రైమ్‌, ఏఆర్‌ సిబ్బంది గురువారం సాయంత్రం వినూత్నంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైబర్‌ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ ప్రవీణ్‌కుమార్‌

కడప అగ్రికల్చర్‌: రైతన్నలు పంటలసాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేసి అధిక దిగుబడులను సాధించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ ప్రవీణ్‌ కుమార్‌ పేర్కొన్నారు. గురువారం కడప ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఖరీఫ్‌ కార్యచరణ ప్రణాళిక–2025పై ఆంధ్రప్రదేశ్‌ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్‌ఎఫ్‌) సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్‌ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, ప్రీ మాన్సూన్‌ డ్రై సోయింగ్‌, 365 డేస్‌ గ్రీన్‌ కవర్‌ల గురించి తెలియ చేశారు. అలాగే మట్టి ఆరోగ్యాన్ని మెరుగు పరిచే విధానాలను అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులందరు ఖచ్చితంగా ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ డీపీఎం వసంతకుమారి, ఏపీసీఎన్‌ఎఫ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న రెవరెండ్‌ ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌రావు

కడప కల్చరల్‌ : ఎంతో ప్రసిద్ధిగాంచిన సువార్త ప్రసంగికులు, పగడాల ప్రవీణ్‌ కుమార్‌ మృతి అనుమానాస్పద రీతిలో ఉందని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, రెవరెండ్‌ ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌ రావు, టి డి ప్రసన్నకుమార్‌, రెవరెండ్‌ పాస్టర్‌ మోహన్‌ బాబు అన్నారు. గురువారం కృప మినిస్ట్రీస్‌లో నిర్వహించిన క్రైస్తవ సమైక్య సమావేశంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, కడప పట్టణానికి చెందిన పగడాల ప్రవీణ్‌ కుమార్‌ దేవుని సువార్తను జాతీయస్థాయిలో చేయడం కడప నగరానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ప్రేమానంద్‌, యుదారాజు, జాన్‌ విజయ్‌ కిషోర్‌ విక్టర్‌,మడగలం ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌ ప్రవీణ్‌కు శ్రద్ధాంజలి

ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన పాస్టర్‌ ప్రవీణ్‌కు గురువారం స్థానిక ప్రముఖులు, గురువులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక వినాయక నగర్‌ చర్చిలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి వాసి టీయస్‌బీఐ డైరెక్టర్‌ సుభాష్‌ చంద్ర బోస్‌ హాజరు కాగా, పాస్టర్‌ మహేష్‌ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇటీవల అనుమానాస్పద స్థితిలో మరణించిన పాస్టర్‌ ప్రవీణ్‌ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఈ సందర్భంగా క్రైస్తవ ప్రముఖులు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.


కొవ్వొత్తులతో దైవజనుల నిరసన ప్రదర్శన

మధ్యంతర భృతి సాధనకు ఏప్రిల్‌ 2న ధర్నా

– ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుచేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ ఏప్రిల్‌ 2న కడప కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. కడప ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు రూ.30వేల కోట్ల బకాయిలు ఉండగా, రెండు విడతలుగా రూ.7300 కోట్లు చెల్లించారని తెలిపారు. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్‌ లీవ్‌, సీపీఎస్‌ బకాయిలు రూ.23 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. మెరుగైన పెన్షన్‌ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ ప్రభుత్వం ఇంత వరకు నెరవేర్చలేదని అన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌ సమస్య పరిష్కరించి, పర్యవేక్షణాధికారి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లా కేంద్రాల కలెక్టర్‌ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కె.సురేష్‌ బాబు, కంభం బాలగంగిరెడ్డి, పాలెం మహేష్‌ బాబు, ఎస్‌ఎండీ.ఇలియాస్‌ బాషా, పి.ఖాదర్‌ బాషా, ఆర్‌.అబ్దుల్లా, రాజశేఖర్‌, హరికొండయ్య, సంగమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బి.రాజు, జ్యోతి, రామచంద్రబాబు, శ్యామలాదేవి పాల్గొన్నారు.

30 నుంచి కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్‌ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం వసంత నవరాత్రి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలను ఈనెల 30 నుంచి ఏప్రిల్‌ 11 వరకు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త దేశు వెంకటరెడ్డి తెలిపారు. ఆలయంలో గురువారం ఆయన భక్తుల సేవా కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాల కరపత్రాల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని నిర్మించి 25 సంవత్సరాలు గడిచిందని, ఈ రజతోత్సవాన్ని పురస్కరించుకుని తొలిసారిగా రోజుకొక వాహన సేవలను ప్రవేశపెడుతున్నామన్నారు. ఈనెల 30న ఉగాది నాడు దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం, సాయంత్రం వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మచే పంచాంగ పఠనం ఉంటుందన్నారు. 31న సాయంత్రం అంకురార్పణ, ఏప్రిల్‌ 1న ఉదయం ధ్వజారోహణ, సాయంత్రం ఊంజల సేవ, స్వామిని శివదర్శనాందం సరస్వతీమాతచే శ్రీమద్‌ రామాయణ ప్రవచనం ఉంటుందన్నారు. 2న ఉదయం చిన్న శేష వాహనం , రాత్రి సింహ వాహన సేవ, 3న ఉదయం ముత్యపు పందిరి, రాత్రి హంస వాహనం , 4న కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్‌ వాహనం, 5న ఉదయం మోహిని ఉత్సవం, సాయంత్రం గరుడ వాహన సేవ, 8న ఉదయం 10.30 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ, 7న సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. 8న ఉదయం సూర్యప్రభ, రాత్రి నృత్య ప్రదర్శన, చంద్రప్రభ వాహన సేవ, 9న ఉదయం చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహనం, 10న ఉదయం సంప్రదాయ వంటల పోటీలు, సాయంత్రం రమణీ రామాయణం నాటిక ప్రదర్శన, రాత్రి శ్రీరామ పట్టాభిషేకం ఉంటుందన్నారు. 11న ఉదయం మహిళలకు ప్రత్యేకంగా సరదా ఆటల పోటీలు, సాయంత్రం పుష్పయాగం నిర్వహించనున్నట్లు వివరించారు.


ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రామాలయ నిర్వాహకులు

ఈకేవైసీ గడువు పొడిగించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికి కొత్త రేషన్‌ కార్డులు మంజూరు చేయకపోగా ఉన్న కార్డులను కుదిచేందుకు ఈ నెలాఖరులోపు ఈకేవైసీ కచ్చితంగా చేయించాలని లబ్ధిదారులను భయాందోళనకు గురి చేయడం తగదని సీపీఐ నగర కార్యదర్శి యన్‌. వెంకట శివ పేర్కొన్నారు. గురువారం స్థానిక రెవిన్యూ డివిజన్‌ కార్యాలయంలో పరిపాలనాధికారి శంకర్‌ రావుకు సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు దారులందరూ డీలర్ల దగ్గర వేలి ముద్రలతో ఈకేవైసీ ఈనెల 31 లోపు చేయించాలని ప్రభుత్వ ప్రకటన చేయటం వల్ల లబ్ధిదారులందరూ ఆందోళన చెందుతున్నారన్నారు. కుటుంబాలలోని కొంతమంది ఉపాధి కోసం, చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఉన్నారని, వారు కుటుంబంతో కలిసి ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు జూన్‌ చివరి వరకు పొడిగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ బాదుల్లా, సుధాకర్‌, మునయ్య పాల్గొన్నారు.


రెవిన్యూ డివిజన్‌ కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

నేడు శుభాల శుక్రవారం

కడప కల్చరల్‌ : ముస్లిం ప్రపంచానికి శుక్రవారం అత్యంత పవిత్రమైన రోజు. ప్రతివారం సాధారణంగా వచ్చే శుక్రవారాన్ని కూడా వారు ఎంతో పవిత్రమైనదిగా గౌరవిస్తారు. ఇక రంజాన్‌ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలను కూడా గొప్పవిగా భావిస్తారు. ఈ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని అద్భుతమైనదిగా, స్వర్గం చేరేందుకు అత్యంత పుణ్యాదాయకమైన మార్గంగా భావిస్తారు.

ఈరోజున.....

మిగతా రోజులతో పోలిస్తే శుక్రవారానికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ముఖ్యంగా జొహర్‌ నమాజ్‌ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. ఎంత ముఖ్య మైన కార్యక్రమమైనా పుణ్యాదాయకమని భావించినా నమాజ్‌ అనంతరమే వాటిని ఆచరిస్తారు. నమాజ్‌ సమయంలో ఏ ఇతర కార్యక్రమాలు పెట్టుకోకుండా ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. జుమ్మా రోజున ప్రత్యేకంగా ఒక ఘడియ ఉంటుందని, ఆ సమయంలో భక్తులు ఏది కోరుకున్నా అల్లాహ్‌ తప్పక అనుగ్రహిస్తాడని ముస్లింలు విశ్వసిస్తారు. జుమ్మా రోజున అజాన్‌ అయినప్పటి నుంచి నమాజ్‌ పూర్తయ్యే వరకు ముస్లింలు ప్రాపంచిక విషయాలను మానేసి దైవచింతనతో గడపాలని పవిత్ర ఖురాన్‌ పేర్కొంటోంది.

ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్‌ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: పదవ తరగతి గణిత ప్రశ్నాపత్రం లీకేజి వ్యవహారంలో అసలు సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దీంతోపాటు విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఆర్‌ఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై గురువారం కడప పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరులో ప్రశ్నపత్రం లీక్‌ చేసి, వేంపల్లి కి వాట్సాప్‌ ద్వారా పంపడం అంటే ముందుగానే ప్రైవేట్‌ స్కూల్స్‌ యాజమాన్యం సిండికేట్‌ అయి లక్షల రూపాయలు చేతులు మార్చుకొని పక్కా ప్రణాళిక బద్ధంగా చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షులు నవీన్‌, నాయకులు సిద్దిక్‌, వినీల్‌, వెంకట్‌ పాల్గొన్నారు.

పది ప్రశ్నపత్రం లీకులపై విచారించాలి

కడప ఎడ్యుకేషన్‌: పది ప్రశ్నాపత్రం లీకులపై విచారించేందుకు ప్రత్యేక కమిటీ వేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు డిమాండ్‌ చేశారు. కడప డీఈఓ కార్యాలయం వద్ద ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నాపత్రం లీకుకు సంబంధించి అసలైన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఉన్నాయని, ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా ఎస్పీ నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం డీఈఓ షేక్‌ షంషుద్దీన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌, అకీరానంద్‌, తేజ చంద్ర, అరుణ్‌, రాజేష్‌, అశోక్‌, లోకాభిరామ్‌ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

కడప ఎడ్యుకేషన్‌: పరీక్షల నిర్వహణలో జరిగే ప్రతి తప్పుకు ఆయా పరీక్ష కేంద్రంలోని చీఫ్‌ సూపరింటెండెంట్‌, డిపార్ట్‌ మెంటల్‌ అధికారి, ఇన్విజిలేటర్లను బాధ్యులను చేస్తూ వారి పట్ల ఉన్నతాధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, మోపుతున్న కేసులు చూస్తే చాలా బాధాకరం అని ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘం(ఆపస్‌) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టెం చెన్నయ్య, కొండారెడ్డిలు అన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు పరీక్షల విధులంటేనే హడలిపోయే పరిస్థితి జిల్లాలో తీసుకురావడం శోచనీయమని, ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు.

భూమి ఆక్రమించిన వారిని అరెస్టు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్‌ : వీరపునాయునిపల్లె మండలంలో దళితుల భూములు ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునెయ్య కోరారు. గురువారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనిమెల గ్రామంలో ప్రభుత్వం 1976లో కొంతమంది దళితులకు డీకేటీ పట్టాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి వారు భూములను సాగు చేసుకుంటున్నారని, ఆన్‌లైన్‌, 1బీ, పాసుపుస్తకాలు, అడంగల్‌ అన్నీ దళితుల పేరిటే ఉన్నాయన్నారు. కొన్నాళ్ల క్రితం విలేజ్‌ మ్యాప్‌, భూమి కొలతలు పూర్తిగా మార్చివేసి దళితుల భూములు తమవని కొంతమంది అగ్రవర్ణాల వారు ఆక్రమించారని తెలిపారు. కొన్నేళ్లుగా సర్వేయర్‌, ఇతర రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా దళితులకు న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా దళితులకు భూములు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

కడప కార్పొరేషన్‌: ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్‌ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని... ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని, గ్రాట్యుటీ వర్తించదంటూ మునిసిపల్‌ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఇచ్చిన ఉత్వర్వులను ఉప సంహరించుకోవాలని ఏపీ మున్సిపల్‌ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌(సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్‌ చేసింది. గురువారం ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి విజయ్‌ కుమార్‌, జిల్లా కోశాధికారి గోపి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ అనే సంస్థ ప్రభుత్వ అధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అని, ఔట్‌ సోర్సింగ్‌ ఏజన్సీల కోసం ఏర్పాటు చేసినట్లు సాంకేతిక కారణాలను సాకుగా చూపి చట్టబద్ధంగా అమలు కావలసిన గ్రాట్యుటీ పథకం అమలు నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అయితేనే గ్రాట్యుటీ వర్తిస్తుందని చెప్పడంలో అర్థం లేదని, యజమాని.. కార్మికుడు అనే సంబంధం ఉన్న ప్రతి సంస్థలోనూ ఉద్యోగులు, కార్మికులు ఎవరికైనా గ్రాట్యూటీ వర్తిస్తుందన్నారు. ఆప్కాస్‌ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని ఇప్పుడు చెప్తున్న ప్రభుత్వం గత నాలుగేళ్లుగా 60 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగులు అనే కారణంతో ఉద్యోగాల నుండి బలవంతంగా పదవీ విరమణ చేయించారని గుర్తు చేశారు. గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతమూలకంగా ఇచ్చిన ఒప్పందం మేరకు రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌తో కూడిన పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు.

రంజాన్‌ ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్‌ : పవిత్ర రంజాన్‌ మాసంలో ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్‌ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఉమేష్‌ చంద్ర కళ్యాణ మండపంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి హాజరవ్వగా, డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్‌ షేక్‌ తదితరులు పాల్గొన్నారు. తొలుత రంజాన్‌ ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉప వాస దీక్ష విరమింపారు. అనంతరం ముస్లింలు సామూహిక నమాజ్‌ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రెసిడెంట్‌, పొలిట్‌ బ్యూరో సభ్యులు శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ రాష్ట్ర సమన్వయ కార్యదర్శిలు గోవర్ధన్‌ రెడ్డి, హరి ప్రసాద్‌, జిల్లా మైనారిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ జిలాని బాష, టీడీపీ సీనియర్‌ నాయకులు అమీర్‌ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఈ–శ్రమ్‌ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత కార్మికుల ప్రమాద బీమా క్లెయిమ్‌లకు ఈ నెల 31వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కడప ఉప కార్మిక కమిషనర్‌ శ్రీకాంత్‌ నాయక్‌ తెలిపారు. ఈ–శ్రమ్‌ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత కార్మికులలో ఎవరైనా ప్రమాదంలో మృతిచెందినా లేదా శాశ్వత పాక్షిక అంగ వైకల్యం పొందినా బీమా కల్పించే ఉద్దేశ్యంతో కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ఎక్స్‌గ్రేషియా మాడ్యూల్‌ను 2023లో ప్రారంభించిందన్నారు. ఈ మాడ్యూల్‌లో క్లెయిమ్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. 2022 మార్చి, 31న లేదా అంతకుముందు ఈ–శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకున్న కార్మికులు పరిహారం క్లెయిమ్‌ చేసుకోవచ్చని తెలిపారు. సందేహాలుంటే కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.